సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
శనివారం । 4 । మే । 2024



చీనీ టన్ను రూ.32 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శుక్రవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.32 వేలు, కనిష్టం రూ.15 వేల ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



సంక్షేమం.. సంతోషం
కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్ పేదల ఇంట సంతోషాలు నింపుతున్నారు. 10లో



జిల్లావ్యాప్తంగా శుక్రవారం గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వడగాల్పుల తీవ్రత పెరిగింది. గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

జగన్ పాటకే భయపడ్డారు!

- హిందూపురంలో టీడీపీకి ఓటమి భయం
- వైఎస్ జగన్ పాటలు పెట్టారంటూ పచ్చ నేతల గొడవ
- వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై దాడి.. ముగ్గురికి గాయాలు

హిందూపురం అర్బన్: ప్రజాభిమానం మెండుగా ఉన్న వైఎస్ జగన్ పేరు చెబితేనే టీడీపీ నేతలకు ముచ్చెమటలు పడుతున్నాయి. 'భళి రా.. భళి భళి రా..భళి రా..పులివెందులలో పుట్టింది పులి రా' అంటూ జనం వైఎస్సార్ సీపీ జెండా పట్టుకుని ఆనందంతో నృత్యాలు చేస్తుంటే టీడీపీ నాయకులు చూసి తట్టుకోలేక ఘర్షణకు దిగుతున్నారు. ఈక్రమంలోనే ముద్దిరెడ్డిపల్లికి చెందిన టీడీపీ నేతలు హద్దులు దాటి ప్రవర్తించారు. గురువారం బాలకృష్ణ సతీమణి వసుంధర ముద్దిరెడ్డిపల్లిలో రోడ్ షో నిర్వహించారు. అదే సమయంలో అక్కడే వైఎస్సార్ సీపీ ప్రచార జీపు కూడా ఉంది. అందులో జగన్ పాటలు వినిపిస్తుండటంతో పచ్చమూకలు రెచ్చిపోయాయి. జగన్ పాటలు ఎందుకు పెట్టారంటూ దౌర్జన్యానికి దిగారు. స్థానికులు నచ్చ జెప్పటంతో అప్పటికి వెనుతిరిగారు. అనంతరం పలువురు టీడీపీ నాయకులు అక్కడ గుమికూడటంతో.. వైఎస్సార్‌సీపీ నాయకులూ అక్కడికి చేరుకున్నారు. ఇంత చిన్న విషయానికి రాద్ధాంతం అవసరం లేదని వైఎస్సార్ సీపీ నేతలు చెబుతుండగానే... టీడీపీ నాయకులు రెచ్చి పోయారు. వైఎస్సార్ సీపీ నాయకులు లోకేష్, నాగభూషణ్‌రెడ్డి, నవీన్, బాబు, ఆసీఫ్‌లపై దాడులకు తెగబడ్డారు. ఈ ఘటనలో లోకేష్‌తో పాటు బాబు, నవీన్‌లకు గాయాలు కాగా, వారిని వెంటనే ఆస్పత్రికి తరలించారు. దీంతో టీడీపీ నేతలు కూడా దాడిలో తమకూ గాయాలయ్యాయని ఆస్పత్రిలో చేరారు. ఆస్పత్రిలోనూ ఇరువర్గాల మధ్య గొడవ ప్రారంభం కాగా, పోలీసులు ఇరువర్గాలను అక్కడి నుంచి పంపించి వేశారు. అనంతరం వైఎస్సార్ సీపీ నేతలు దాడులకు తెగబడిన టీడీపీ నేతలపై వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వైఎస్సార్ సీపీ నేతలపై టీడీపీ నేతలూ ఫిర్యాదు చేశారు.

నేడు జననేత జగన్ రాక



- ఉదయం 11 గంటలకు హిందూపురం సభకు హాజరు
- ఘన స్వాగతం పలికేందుకు ప్రజలు 'సిద్ధం'
- ఎన్నికల నేపథ్యంలో దిశానిర్దేశం చేయనున్న సీఎం

సాక్షి, పుట్టపర్తి

సంక్షేమ పథకాల ప్రదాత, 'నవరత్నాలు'తో పేదల జీవితాల్లో వెలుగులు నింపిన జననేత, కనీవినీ ఎరుగని రీతిలో సంక్షేమాభివృద్ధి చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా మరోసారి జిల్లాకు వస్తున్నారు. శనివారం హిందూపురం అంబేడ్కర్ సర్కిల్‌లో నిర్వహించనున్న బహిరంగ సభలో పాల్గొననున్నారు. ఆయనకు ఘన స్వాగతం పలికేందుకు అభిమానులు, నాయకులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు ఉత్సాహంగా ఉన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇటీవల సీఎం జగన్ 'మేమంతా సిద్ధం' బస్సుయాత్రలో ధర్మవరం, కదిరి నియోజకవర్గాల్లో పర్యటించారు. తాజాగా ఎన్నికల ప్రచారంలో భాగంగానే హిందూపురం వస్తున్నారు.

భారీ ఏర్పాట్లు..

సీఎం బహిరంగ సభ కోసం వైఎస్సార్ సీపీ నేతలు భారీ ఏర్పాట్లు చేశారు. శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్సీ, సీఎం ప్రోగ్రామ్స్ కో–ఆర్డినేటర్ తలశిల రఘురాం, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు బుక్కపట్నం నవీన్‌నిశ్చల్, వైఎస్సార్ సీపీ హిందూపురం అసెంబ్లీ అభ్యర్థి దీపికతో పాటు జిల్లా నాయకులు అంబేడ్కర్ సర్కిల్ వద్ద బహిరంగ సభ ఏర్పాట్లు, ఎంజీఎం కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌ను పరిశీలించారు. అనంతరం నవీన్ నిశ్చల్ మాట్లాడుతూ.. హిందూపురం పార్లమెంటు పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి వైఎస్సార్ సీపీ అభిమానులు, కార్యకర్తలు, నేతలు, ప్రజలు తరలివచ్చి.. సీఎం పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



హిందూపురం అంబేడ్కర్ సర్కిల్‌లో భద్రతా ఏర్పాట్లు పరిశీలిస్తున్న పోలీసు అధికారులు

ఎన్నికలపై సీఎం దిశా నిర్దేశం..

ఎన్నికల ప్రచారంలో భాగంగా హిందూపురం వస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం ఉదయం 11 గంటలకు అంబేడ్కర్ సర్కిల్‌లో నిర్వహించే బహిరంగ సభలో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులను ఉద్దేశించి వైఎస్ జగన్ ప్రసంగించనున్నారు. గత ఐదేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి వివరించడంతో పాటు తాజా మేనిఫెస్టోపై కూడా మాట్లాడనున్నారు. ఎన్నికలపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేయనున్నారు. అలాగే హిందూపురం ఎంపీ అభ్యర్థి జోలదరాశి శాంతమ్మ, హిందూపురం అసెంబ్లీ అభ్యర్థి టీఎన్ దీపికకు మద్దతు తెలపాలని ప్రజలను కోరనున్నారు.

రెండు వేల మందితో పోలీసు బందోబస్తు

సీఎం పర్యటన నేపథ్యంలో సుమారు రెండు వేల మంది పోలీసులతో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. ఎస్పీ మాధవరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం హిందూపురం ఎంజీఎం మైదానంలోని హెలిప్యాడ్ నుంచి అంబేడ్కర్ సర్కిల్‌లో నిర్వహించే బహిరంగ సభ వరకు సీఎం కాన్వాయ్ ట్రయల్ రన్‌ను నిర్వహించారు. శుక్రవారం ఉదయం నుంచి పోలీసు బలగాలు హిందూపురం చేరుకున్నాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి పోలీసు సిబ్బంది హిందూపురం వచ్చారు. మరికొందరు పుట్టపర్తిలోని శ్రీసత్యసాయి విమానాశ్రయం వద్ద బందోబస్తులో ఉన్నారు. అనుమతి ఉన్న వీవీపీలను మాత్రమే లోపలికి అనుమతిస్తారు.

సీఎం జగన్ షెడ్యూల్ ఇలా...

- సీఎం జగన్‌మోహన్‌రెడ్డి శనివారం ఉదయం 9 గంటలకు తాడేపల్లిలోని నివాసం నుంచి రోడ్డుమార్గం గుండా బయలుదేరి ఉదయం 9.20 గంటలకు గన్నవరం విమానాశ్రయం చేరుకుంటారు.
- ఉదయం 9.25 గంటలకు విమానంలో బయలుదేరి ఉదయం 10.10 గంటలకు పుట్టపర్తిలోని శ్రీసత్యసాయి విమానాశ్రయం చేరుకుంటారు.
- ఉదయం 10.20 గంటలకు పుట్టపర్తి విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి.. 10.35 గంటలకు హిందూపురంలోని హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు.
- 10.45 గంటలకు హెలిప్యాడ్ నుంచి రోడ్డు మార్గం గుండా బయలుదేరి 10.55 గంటలకు హిందూపురంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన సభాస్థలి వద్దకు చేరుకుంటారు.
- ఉదయం 11 గంటల నుంచి 11.45 గంటల వరకు సభలో పాల్గొంటారు
- అనంతరం 11.55 గంటలకు సభాస్థలి నుంచి హిందూపురంలోని హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు.
- మధ్యాహ్నం 12.10 గంటలకు హెలికాప్టర్‌లో పలమనేరుకు బయలుదేరి వెళ్తారు.

అన్న వస్తున్నాడు.. తరలిరండి

- సీఎం జగనన్న సభను విజయవంతం చేద్దాం
- వైఎస్సార్ సీపీ 'పురం' అసెంబ్లీ అభ్యర్థి దీపిక పిలుపు



హిందూపురం: జనరంజక పాలనతో అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం హిందూపురం వస్తున్నారని హిందూపురం నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి టీఎన్ దీపిక తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉదయం స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో నిర్వహించే బహిరంగ సభలో ప్రసంగిస్తారన్నారు. జగనన్నకు అపూర్వ స్వాగతం పలికేందుకు వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు, అనుబంధ సంఘాల నాయకులు, అన్ని వర్గాల సంఘాలు, పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని దీపిక పిలుపునిచ్చారు. 2019 మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2024 ఎన్నికల మేనిఫెస్టో సైతం విడుదల చేశారని, ఈ సారి కూడా ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తారన్నారు. 'జగనన్న చెప్పారంటే చేస్తారంతే' అని జనమే చెబుతున్నారన్నారు. ఇన్నాళ్లు హిందూపురం నుంచి టీడీపీ గెలుస్తూ వచ్చినా... నియోజకవర్గం ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. హిందూపురం ప్రజలు మార్పును కోరుకుంటున్నారని, 2024 ఎన్నికలతో హిందూపురం నియోజకవర్గ దశ తప్పకుండా మారుతుందన్నారు. ఇందుకు నాంది పలకడానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హిందూపురం నడిబొడ్డున అడుగిడుతున్నారన్నారు.

కుచ్చుటోపీ చుట్టాలొచ్చారోచ్!

- పదేళ్లుగా ఎమ్మెల్యేగా ఉన్నా హిందూపురాన్ని పట్టించుకోని బాలయ్య
- సినిమా షూటింగులతో బిజీ
- అప్పుడప్పుడూ కనిపిస్తూ వెంటనే మాయం
- ఎన్నికలు రావడంతో నేడు ఎంట్రీ
- ఆయన కుటుంబం మొత్తం ఇక్కడే మకాం
- ప్రజలపై లేని ప్రేమ ఒలకబోస్తూ మళ్లీ కుచ్చుటోపీ పెట్టే యత్నం
- నమ్మని జనం.. గుణపాఠం చెప్పేందుకు సిద్ధం!

ఉంటే సినిమా షూటింగులో.. అది లేదంటే హైదరాబాద్‌లో ఉంటారాయన. తనను నమ్మి గెలిపించిన ప్రజలు అప్పుడప్పుడూ ఆయనకు గుర్తొస్తుంటారు. అలా యాదికొచ్చినప్పుడల్లా ఈ ప్రాంతానికి చుట్టపుచూపుగా వస్తుంటారు. స్థానికుల అవస్థలు పట్టించుకోకుండా వెంటనే వెళ్లిపోతుంటారు. అయితే, నేడు ఎన్నికలు రావడంతో నియోజకవర్గంలో వాలిపోయారు. వెంటే కుటుంబ సభ్యులను తెచ్చుకున్నారు. ప్రచారం పేరుతో ప్రజల్లోకి వెళ్తున్న వారంతా లేని ప్రేమ ఒలకబోస్తున్నారు. ఏళ్ల పాటు ఎమ్మెల్యేగా ఉన్నా ఏమీ చేయకుండానే కాలక్షేపం చేసి.. నేడు మరోసారి గెలిపిస్తే అది చేస్తాం, ఇది చేస్తాం అంటూ మళ్లీ ప్రజలకు కుచ్చుటోపీ పెట్టేందుకు యత్నిస్తున్నారు.





గత ఎన్నికలప్పుడు హిందూపురం వచ్చిన బాలకృష్ణ కుమార్తెలు నేడు ఎన్నికల సందర్భంగా స్త్రీ శక్తి అంటూ స్థానిక మహిళలను మచ్చిక చేసుకుంటున్నారిలా.. (ఫైల్)

సాక్షి ప్రతినిధి, అనంతపురం: పదేళ్లుగా హిందూపురం నియోజకవర్గానికి బాలకృష్ణ ఎమ్మెల్యేగా ఉన్నా ఎప్పుడూ పట్టుమని పదిరోజులు కూడా స్థానికంగా ఉన్న దాఖలాలు లేవు. ఓవైపు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేలు 'గడప గడపకూ' అంటూ నిత్యం ప్రజల్లో ఉంటూ సమస్యలు పరిష్కరిస్తుంటే.. బాలయ్య మాత్రం నిత్యం షూటింగులతో బిజీగా ఉండేవారు. అయితే, నేడు ఎన్నికలు రావడంతో 'పురం'పై వాలిపోయారు. బాలకృష్ణతో పాటు ఆయన భార్య వసుంధర, కూతురు బ్రాహ్మణి ఇలా మొత్తం హిందూపురం చేరారు.

పీఏలదే పెత్తనం

బాలకృష్ణ లేకపోవడంతో ఆయన పీఏలే పెత్తనం చెలాయించేవారు. అధికారం మాటున యథేచ్ఛగా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడేవారు. తమ నాయకుడికే పట్టనప్పుడు తమకేం సంబంధం అన్నట్లు ప్రజలకు అంటీముట్టనట్లు వ్యవహరించేవారు. ఒక వైపు అప్పుడప్పుడు వచ్చి పోయే ఎమ్మెల్యే, మరో వైపు తమ వ్యాపకాల్లో మునిగితేలే ఆయన పీఏలు.. ఇలా ఎవరికి వారు బిజీబిజీగా ఉండే నేపథ్యంలో స్థానిక ప్రజలు తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియక విసిగి పోయారు.

బావ బాటలో బామ్మర్ది..

తన సొంత బావ చంద్రబాబు సీఎంగా ఉన్న 2014–19 మధ్య కాలంలో కూడా హిందూపురం నియోజకవర్గంలో అభివృద్ధికి ఒక్క పునాది రాయి కూడా బాలకృష్ణ వేయలేదు. కానీ, నేడు బావ కుటిల సూత్రాలు పాటించేందుకు సిద్ధమయ్యారు. 2014లో బాబు ముఖ్యమంత్రి అయ్యాక సంతలో పశువులను కొన్నట్టుగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన 23 మంది ఎమ్మెల్యేలను కొనుగోలు చేయగా.. ఆయనను ఆదర్శంగా తీసుకున్న బాలయ్య నేడు ఎన్నికల నేపథ్యంలో ఇద్దరు కౌన్సిలర్లు, ఒక జెడ్పీటీసీ, ఒక ఎంపీటీసీని కొనుగోలు చేశారు. ఒక్కొక్కరికి ఒక్కోరేటు నిర్ణయించి తమ వైపు తిప్పుకున్నారు.

వ్యతిరేకతను గ్రహించి ప్రలోభాలు..

గత పదేళ్లు బాలకృష్ణ నిర్లక్ష్యపు తీరుతో విసిగిపోయిన స్థానికులు ఈ ఎన్నికల్లో మాత్రం తగిన గుణపాఠం చెప్పేందుకే సిద్ధమైనట్లు తెలిసింది. ఈ విషయాన్ని పసిగట్టిన బాలకృష్ణ ప్రలోభాలకు తెరలేపారు. అందులో భాగంగానే ఇప్పటికే వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లను కొన్న ఆయన.. అంతటితో ఆగక ప్రజలకు చీరలు, డబ్బు పంచడం తదితర అనైతిక చర్యలకు పాల్పడుతున్నట్టు సమాచారం.

తామెందుకు ఎమ్మెల్యేలు కాకూడదు!

బాలకృష్ణ వైఖరిపై అక్కడి ప్రజలే కాదు... టీడీపీ నాయకులు కూడా విసుగెత్తినట్లు తెలుస్తోంది. ఇప్పటివరకూ నందమూరి కుటుంబాన్ని ఆదరించింది చాలు.. వారిని ఇలాగే గెలిపిస్తూ వెళితే తమకు అవకాశం రాదు అన్న ఆలోచనలో పడినట్లు సమాచారం. గతంలో ఎమ్మెల్యేగా పనిచేసిన ఓ టీడీపీ నేతతో పాటు ఆ పార్టీకే చెందిన మరో ముఖ్యనాయకుడు కిందిస్థాయి కార్యకర్తల వద్ద ఈ విషయంపై చర్చించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. వారిని ఆదరిస్తున్నాం కదా అని అలుసైపోయాం, ఒక్కసారి ఓడిస్తే వాళ్లు వేరే నియోజకవర్గం చూసుకుంటారు అంటూ మాట్లాడుకున్నట్లు ఆ సమయంలో అక్కడ ఉన్న ఓ నాయకుడు తెలిపాడు.

సుపరిపాలనకు పట్టం కట్టండి

- అబద్ధాల కోరు చంద్రబాబుకు గుణపాఠం నేర్పండి
- నందమూరి లక్ష్మీపార్వతి పిలుపు



మాట్లాడుతున్న నందమూరి లక్ష్మీపార్వతి, చిత్రంలో మంత్రి ఉషశ్రీ చరణ్

గోరంట్ల: జనరంజక పాలనతో అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎన్నికల్లో అందరూ మద్దతు ఇవ్వాలని దివంగత ఎన్టీఆర్ సతీమణి, రాష్ట్ర తెలుగు అకాడమీ చైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి కోరారు. శుక్రవారం ఆమె గోరంట్లలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంత్రి, వైఎస్సార్ సీపీ పెనుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీచరణ్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. సచివాలయాలు ఏర్పాటు చేసి వలంటీర్ వ్యవస్థ తీసుకువచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జాతిపిత మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేశారన్నారు. అందుకే సంక్షేమం ప్రజల ముంగిళ్లకే చేరుతోందన్నారు. అలాగే బడుగు, బలహీన వర్గాలకు టికెట్లు ఇచ్చి చట్టసభలకు పంపారన్నారు. కానీ 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేశానని చెప్పుకునే చంద్రబాబు ఇందులో ఏ ఒక్కటీ చేయలేకపోయారన్నారు. ఆయనకు తెలిసిందల్లా వెన్నుపోటు, అబద్ధాలు, అవినీతి మాత్రమేనన్నారు.

జనం కోసమే జగన్..

జనం కోసమే వైఎస్ జగన్ రాజకీయాల్లోకి వచ్చారన్నారు. నిరంతరం ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్నారన్నారు. గడచిన ఐదేళ్లలో విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేశారన్నారు. విప్లవాత్మక మార్పులతో దేశానికే కీర్తి తెచ్చారన్నారు. అలాగే అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించారన్నారు. 66 లక్షల మంది వృద్ధులకు నెలకు రూ.3 వేల చొప్పున ప్రతి నెల 1 వతేదీనే ఇంటివద్దే పింఛన్ ఇస్తున్నారని గుర్తు చేశారు. మళ్లీ ఇలాంటి సుపరిపాలన కావాలంటే అందరూ జగన్‌కు మద్దతు తెలపాలని, పెనుకొండలో ఉషశ్రీ చరణ్‌ను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు నార్సింపల్లి రామలింగారెడ్డి, నాగే నాయక్, రాజారెడ్డి పాల్గొన్నారు.

మంచి జరగాలంటే ఫ్యాన్‌కు ఓటేయండి

హిందూపురం: ఎన్టీఆర్‌కు ఎంతో ఇష్టమైన ప్రాంతం హిందూపురం..ఈ ప్రాంతానికి మంచి జరగాలంటే అందరూ వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలుపుతూ 'ఫ్యాన్' గుర్తుకు ఓటు వేయాలని నందమూరి లక్ష్మీపార్వతి కోరారు. శుక్రవారం ఆమె హిందూపురంలో విలేకరులతో మాట్లాడారు. ఎన్టీఆర్‌కు జరిగిన ద్రోహం, వెన్నుపోటును ఆయన అభిమానులు ఒకసారి గుర్తు చేసుకుని ఈ సారి ఎన్నికల్లో నమ్మకద్రోహులకు గుణపాఠం చెప్పాలన్నారు. నిజమైన ఎన్టీఆర్ అభిమానులంతా ఈసారి ఎమ్మెల్యే అభ్యర్థి టీఎన్ దీపిక, ఎంపీ అభ్యర్థి శాంతమ్మలను గెలిపించాలని కోరారు.

ఎన్నికల నిర్వహణకు సిద్ధం

- ఎన్నికల కమిషన్ డిప్యూటీ కమిషనర్‌కు వివరించిన అధికారులు



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు, చిత్రంలో ఎస్పీ మాధవరెడ్డి, ఎన్నికల పరిశీలకులు

పుట్టపర్తి అర్బన్: సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం చేశామని, ఈ మేరకు ఏర్పాట్లు సైతం పూర్తి చేశామని జిల్లా ఎన్నికల అధికారి అరుణ్ బాబు, ఎన్నికల పరిశీలకులు అన్పుకుమార్ కేంద్ర ఎన్నికల కమిషన్ డిప్యూటీ కమిషనర్ నితేష్ వ్యాస్‌కు తెలిపారు. ఎన్నికల నిర్వహణపై కేంద్ర ఎన్నికల డిప్యూటీ కమిషనర్ జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలు నుంచి జిల్లా ఎన్నికల అధికారి అరుణ్‌బాబు, హిందూపురం పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు అన్పుకుమార్, దీపక్ రామచంద్ర తివారీ, పోలీస్ పరిశీలకులు ఇమ్నాలెన్నా, ఎన్నికల వ్యయ పరిశీలకులు అమిత్‌కుమార్, వినాయక్, రిథం బాజ్వా, ఎస్పీ మాధవరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర ఎన్నికల డిప్యూటీ కమిషనర్ నితేష్ వ్యాస్ మాట్లాడుతూ... రీపోలింగ్‌కు తావులేకుండా, హింసాత్మక సంఘటనలు చోటుచేసుకోకుండా నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించారు. అలాగే ఎన్నికల నిర్వహణకు చేసిన ఏర్పాట్లు, తీసుకున్న చర్యలు తెలుసుకున్నారు. అనంతరం ఎన్నికల పరిశీలకులు అన్పుకుమార్ మాట్లాడుతూ.. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని చర్యలూ తీసుకున్నామని వివరించారు. పోలీస్ అబ్జర్వర్ ఇమ్నాలెన్నా మాట్లాడుతూ... ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్టులు ఏర్పాటు చేసి స్వయంగా పరిశీలించినట్లు వెల్లడించారు. ఎస్ఎస్‌టీ, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు సెక్యూరిటీ ప్లాన్ నిబంధనల మేరకు సిద్ధంగా ఉన్నాయన్నారు. వ్యయ పరిశీలకులు అమిత్‌కుమార్ మాట్లాడుతూ... అంతర్రాష్ట్ర, జిల్లా చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని, ఎన్నికల నియమ నిబంధనలన్నీ పాటిస్తూ జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు పక్కాగా చేసిందన్నారు.

వందశాతం వెబ్‌క్యాస్టింగ్..

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అరుణ్ బాబు మాట్లాడుతూ... రాజకీయ పార్టీల అభ్యర్థులతో సమావేశాలు నిర్వహించి ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలు వివరించామని, ప్రశాంత ఎన్నికలకు తగిన చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఇప్పటికే బీఎల్‌ఓల ద్వారా ఓటరు స్లిప్పుల పంపిణీ చేపడుతున్నామని వివరించారు. వంద శాతం వెబ్ క్యాస్టింగ్ నిర్వహిస్తున్నామని, అవసరం మేరకు మైక్రో అబ్జర్వర్ల సైతం నియమించామన్నారు. పోలింగ్ కేంద్రాల్లోనూ మౌలిక వసతులు కల్పించామని తెలిపారు. ఎస్పీ మాధవరెడ్డి మాట్లాడుతూ... సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ముందుగానే గుర్తించి తగు చర్యలు చేపట్టినట్లు వివరించారు. పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు.

ఫెసిలిటేషన్ కేంద్రాల ఏర్పాటు

- 4, 6 తేదీల్లో పోస్టల్ బ్యాలెట్‌కు అవకాశం
- సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పిలుపు

పుట్టపర్తి అర్బన్: ఎన్నికల విధుల్లో ఉండే ఉద్యోగులు ఈనెల 4, 6 తేదీల్లో పోస్టల్ బ్యాలెట్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అరుణ్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందుకోసం జిల్లాలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఫెసిలిటేషన్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఓటరుగా నమోదై, ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులంతా ఆయా ఫెసిలిటేషన్ కేంద్రాల్లో పోస్టల్ బ్యాలెట్ వేయాలన్నారు. ఈనెల 4, 6 తేదీల్లో పీఓలు, ఏపీఓలకు ఆయా నియోజకవర్గ కేంద్రాల్లో శిక్షణ తరగతులు నిర్వహించిన అనంతరం పోస్టల్ బ్యాలెట్ అందిస్తామన్నారు. ఓపీఓలకు ఈనెల 7వ తేదీన శిక్షణతో పాటు పోస్టల్ బ్యాలెట్ ఇస్తామన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌కు 1,211 మంది దరఖాస్తు

జిల్లాలో ట్రెజరీ, సివిల్ సప్లయీస్, హోం గార్డ్, పోలీస్, రైల్వే, ఆర్టీసీ, హెల్త్, సెబ్, ఐఅండ్ పీఆర్, ఎలక్ట్రిసిటీ, ఆర్‌టీఓ, ప్రెస్, ఫైర్ తదితర శాఖల్లోని సుమారు 1,211 మంది పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. ఇందులో హిందూపురం నియోజకవర్గంలో 170 మంది, కదిరి నియోజకవర్గంలో 258 మంది, ధర్మవరం నియోజకవర్గంలో 248 మంది, పెనుకొండలో 169 మంది, పుట్టపర్తిలో 264 మంది, మడకశిరలో 102 మంది ఉన్నారన్నారు. ఇక ఇతర జిల్లాల్లోని 12 శాఖలకు సంబంధించిన ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకున్నారు. అందులో అనంతపురం జిల్లాకు సంబంధించి 541, చిత్తూరు 13, గుంటూరు 1, వైఎస్సార్ 20, కర్నూలు 27, నంద్యాల 24, నెల్లూరు 2, అన్నమయ్య 17, తిరుపతి 17, విజయనగరం 1, శ్రీకాకుళం 2, ప్రకాశం 1..ఇలా మొత్తంగా 6,66 ఉన్నాయి.

ఫెసిలిటేషన్ కేంద్రాలు ఇలా...

- రాప్తాడు నియోజకవర్గానికి సంబంధించి అనంతపురం పంగల్‌రోడ్‌లోని టీటీడీసీ కేంద్రం
- మడకశిర నియోజకవర్గానికి మడకశిర పాత తహసీల్దార్ కార్యాలయం
- హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గానికి హిందూపురం పాత తహసీల్దార్ కార్యాలయం
- పెనుకొండ అసెంబ్లీ నియోజకవర్గానికి పెనుకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల
- పుట్టపర్తి అసెంబ్లీ నియోజకవర్గానికి చిన్నపల్లి జెడ్పీ హైస్కూల్
- ధర్మవరం అసెంబ్లీ నియోజకవర్గానికి ధర్మవరంలోని సాయికృప జూనియర్ కళాశాల
- కదిరి అసెంబ్లీ నియోజక వర్గానికి కదిరి బాలికల జెడ్పీ హైస్కూల్

క్లుప్తంగా

కర్ణాటక మద్యం సీజ్



సీజ్ చేసిన మద్యాన్ని చూపుతున్న సెబ్ అధికారులు

హిందూపురం అర్బన్: స్థానిక సెబ్ స్టేషన్ పరిధిలో పోలీసులు శుక్రవారం చేపట్టిన తనిఖీల్లో అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యం పట్టుబడింది. సెబ్ సీఐ రాజశేఖర్‌గౌడ్ తెలిపిన మేరకు... పోచనపల్లి నుంచి హిందూపురం వెళ్లే మార్గంలో పెన్నానది వద్ద శుక్రవారం ఉదయం సెబ్ పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అటుగా వచ్చిన ద్విచక్ర వాహనదారుడిని ఆపి తనిఖీ చేస్తే 768 టెట్రా ప్యాకెట్ల కర్ణాటక మద్యం బయటపడింది. వాహనాన్ని సీజ్ చేసి, మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. మద్యం తరలిస్తున్న కర్ణాటకలోని తుమకూరు జిల్లా మధుగిరి తాలుకా జలతిమ్మనహళ్లికి చెందిన రంగనాథ్‌ను అరెస్ట్ చేశారు.

ఏపీఆర్‌ఎస్‌ను సందర్శించిన సీమాట్ డైరెక్టర్



విద్యార్థి మంజునాథ్‌ను అభినందిస్తున్న సీమాట్ డైరెక్టర్ మస్తానయ్య, ప్రిన్సిపాల్ మురళీధర్‌బాబు, తదితరులు

పరిగి: మండలంలోని కొడిగెనహళ్లి ఏపీ గురుకుల ఆశ్రమ ప్రతిభావంతుల పాఠశాల (ఏపీఆర్‌ఎస్)ను శుక్రవారం సీమాట్ డైరెక్టర్, సమగ్ర శిక్ష ఏఎస్ పీడీ మస్తానయ్య సందర్శించారు. పాఠశాలలో మౌలిక వసతులతో పాటు పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు సాధించిన ర్యాంకులను ప్రిన్సిపాల్ మురళీధర్ బాబుతో అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఈ విద్యా సంవత్సరంలో రాష్ట్ర స్థాయిలో పదో తరగతి పరీక్షల్లో ప్రతిభను ప్రదర్శించిన విద్యార్థి మంజునాథ్‌ను అభినందించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఏఎంఓ మహేంద్రరెడ్డి, హిందూపురం ఎంఈఓ గంగప్ప, హెచ్‌ఎంలు కృపాసత్యరాజు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సంక్షేమం... సంతోషం

- గడప వద్దకే సంక్షేమ పథకాలు
- ప్రజల సుఖసంతోషాల్లో పాలు పంచుకున్న జగన్ ప్రభుత్వం





జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఉచితంగా మందులు అంజేస్తున్న దృశ్యం (ఫైల్), గ్రామంలోనే విత్తన కాయలు కొనుగోలు చేస్తున్న రైతులు (ఫైల్)

పుట్టపర్తి అర్బన్: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన అంటే ఎలా ఉండాలో చూపించారు. ప్రజల సుఖసంతోషాల్లో పాలు పంచుకుంటూ ప్రతి అంశంలోనూ అండగా నిలిచారు. విప్లవాత్మక సంస్కరణలతో విద్య, వైద్య, వ్యవసాయ రంగాలను బలోపేతం చేశారు. అక్కచెల్లెమ్మలకు తోడుగా ఉంటూ వారి ఆర్థిక స్థితిగతులు మెరుగుపడేలా చేశారు. సీఎం వైఎస్ జగన్ పాలన చూసిన ఇతర రాష్ట్రాల ప్రజాప్రతినిధులు, రాజకీయ విశ్లేషకులు ఫిదా అయ్యారు.

చంద్రబాబు గుర్తొచ్చే పథకం ఒక్కటీ లేదు..

తన మామ ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి టీడీపీని లాక్కొని తానే ఆ పార్టీ అధినేతగా చలామణి అవుతున్న చంద్రబాబు చరిత్ర, ఏ మేనిఫెస్టో చూసిన మోసాలు తప్ప మరేమీ కనిపించడం లేదు. 1994 నుంచి 2014 వరకు ఆయన ఇచ్చిన హామీలు అన్నింటిలోనూ ఇదే స్పష్టమవుతోంది. 2014 ఎన్నికల సమయంలో 600కు పైగా హామీలతో మేనిఫెస్టో విడుదల చేస్తే అందులో కనీసం పది కూడా అమలు చేయలేదని రాజకీయ విశ్లేషకులు సైతం అంటున్నారు. 14 ఏండ్లు సీఎంగా పనిచేసిన చంద్రబాబు పేరు చెబితే గుర్తొచ్చే పథకం ఒక్కటీ కూడా లేకపోవడం గమనార్హం. చంద్రబాబు రాజకీయం ఓ గ్యాంబ్లింగ్‌లాంటిదనే విమర్శలూ ఉన్నాయి. చంద్రబాబు గ్యాంబ్లింగ్‌ను నమ్మి ఓటేసిన ప్రజలు నట్టేట మునిగిపోవడం తప్ప బాగుపడిన దాఖలాలు ఒక్కటి కూడా లేవు.

జగనన్న పాలనలో సంక్షేమ విప్లవం..

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలి రెండేళ్లు కరోనా విపత్కర పరిస్థితులతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి పూర్తిగా దిగజారిపోయింది. అయినా ఎక్కడేగాని సంక్షేమాన్ని సీఎం వైఎస్ జగన్ ఆపలేదు. 2019 ఎన్నికలకు ముందు ఇచ్చిన ప్రతి ఒక్క హామీని తూచ తప్పకుండా నెరవేరుస్తూ వచ్చారు. కరోనా పరిస్థితి నెమ్మదించిన తర్వాత మూడేళ్లా రాష్ట్రంలో సంక్షేమ విప్లవం కొనసాగింది. సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి లక్షలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించి, గ్రామ స్వరాజ్యాన్ని సిద్ధింప జేశారు. వలంటీర్ వ్యవస్థతో ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందజేశారు. ఇంటి వద్దకే రేషన్, పింఛన్ల పంపిణీ చేపట్టారు. జిల్లాలో 349 ఎండీయూ వాహనాల ద్వారా 8,300 మెట్రిక్ టన్నుల బియ్యంతో పాటు ఇతర నిత్యావసర సరుకులను 5.61 లక్షల కుటుంబాలకు ఇంటి వద్దనే పంపిణీ చేసేలా చర్యలు తీసుకున్నారు. రైతులకు సీజన్‌కు ముందే పెట్టుబడి సాయం అందజేస్తూనే మరో వైపు నాణ్యమైన విత్తనాలు, ఎరువులను గ్రామస్థాయిలోనే ఆర్‌బీకేల ద్వారా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. జిల్లాలోని 2,72,762 లబ్ధిదారులకు ప్రతి నెలా 1, 2 తేదీల్లోనే సామాజిక భద్రతా పింఛన్లను ఇంటి వద్దనే వలంటీర్ల ద్వారా అందజేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌దే.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వివిధ పథకాల లబ్ధి ఇలా...

పథకం	లబ్ధిదారుల సంఖ్య
వైఎస్సార్ పింఛన్‌కానుక	2.72 లక్షల మంది
ఉచిత రేషన్	5.61 లక్షల కుటుంబాలు
విత్తన కాయలు	2.23 లక్షలు
జగనన్న సురక్ష	4.99 లక్షల మంది
జగనన్న ఆరోగ్య సురక్ష	2.9 లక్షలు (రెండు విడతలు)
ఆర్‌బీకేలు	416
సచివాలయాలు	544

సొంతింటి కల సాకారం చేస్తూ..

దశాబ్దాలుగా సొంతిల్లు లేకుండా ఇబ్బంది పడుతున్న నిరుపేదలకు సీఎం వైఎస్ జగన్ అండగా నిలిచారు. అధికారం చేపట్టిన అనతి కాలంలోనే నవరత్నాలు – పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా అర్హులైన ప్రతి ఒక్కరికి ఇంటి పట్టాను అందజేయడమే కాక పక్కా గృహ నిర్మాణం చేయించి ఇచ్చారు. సీఎం వైఎస్ జగన్ తీసుకున్న ఈ నిర్ణయంతో జగనన్న కాలనీల పేరుతో ఏకంగా ఊళ్లే ఏర్పాటు కావడం గమనార్హం. రూ.లక్షల విలువైన స్థిరాస్తులకు రక్షణ కల్పిస్తూ 'జగనన్న భూహక్కు –భూరక్ష' కార్యక్రమం కింద ప్రభుత్వమే సర్వే చేయించి రైతులకు చట్టబద్ధత కల్పించి ఇచ్చింది. జగనన్న ఆరోగ్య సురక్ష పేరుతో 11 రకాల సర్టిఫికెట్లను గ్రామ స్థాయిలనే ఉచితంగా అందజేశారు. జిల్లాలోని 544 సచివాలయాల ద్వారా దాదాపు 4.99 లక్షల సర్టిఫికెట్లను లబ్ధిదారులు అందుకున్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానంతో ఇంటి వద్దకే నాణ్యమైన వైద్య సేవలను చేరువ చేశారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి పది రకాల వైద్య పరీక్షలు చేసి దీర్ఘకాలిక జబ్బులకు సంబంధించిన మందులను ఉచితంగా అందజేశారు. జిల్లా రెండు విడతల్లో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల్లో 2.90 లక్షల మంది నాణ్యమైన వైద్య సేవలను గ్రామ స్థాయిలోనే అందుకున్నారు.

వెటర్నరీ అంబులెన్స్‌లలో డ్రైవర్ పోస్టుల భర్తీకి చర్యలు

అనంతపురం అగ్రికల్చర్: ఉమ్మడి జిల్లా పరిధిలో 1962 మొబైల్ వెటర్నరీ అంబులెన్స్ పైలెట్లు (డ్రైవర్లు)గా పనిచేయడానికి అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ మేరకు ఆ విభాగం జిల్లా మేనేజర్ అనిల్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 36 సంవత్సరాల్లోపు వయసత్స, 10వ తరగతి ఉత్తీర్ణత, హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన వారు అర్హులు. ఎంపికైన వారికి నెలకు రూ.10,800 వేతనంతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయం ఉంటుంది. ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పనిచేయాల్సి ఉంటుంది. అర్హత, ఆసక్తి కలిగిన వారు 91549 70180 నంబరులో సంప్రదించవచ్చు.

కుక్కకూ సిజేరియన్!

- గర్భాశయంలోనే చనిపోయిన పిల్లలు



కుక్కకు సిజేరియన్ చేసిన శింగనమల పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ పద్మనాభం, వైద్య బృందం

గార్లదిన్నె: శింగనమల పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ పద్మనాభం, వైద్య బృందం మరో అరుదైన శస్త్ర చికిత్సతో ఓ కుక్కకు ప్రాణం పోశారు. వివరాలు... గార్లదిన్నెకు చెందిన రైతు భాస్కరరెడ్డి ఓ వీధి కుక్కను చేరదీసి, దాని బాగోగులు చూసుకుంటున్నాడు. ఇటీవల గర్భం దాల్చిన ఆ కుక్క నెలలు నిండి ఈనడానికి ఇబ్బంది పడుతుంటే వెంటనే గార్లదిన్నెలోని పశువైద్యశాలకు తీసుకెళ్లాడు. పరీక్షించిన పశువైద్యాధికారి రమేష్ వెంటనే అనంతపురానికి రెఫర్ చేసి, శింగనమల పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ పద్మనాభం సాయం తీసుకున్నారు. పరీక్షించిన ఆయన గర్భంలోనే కుక్క పిల్లలు చనిపోయినట్లుగా నిర్ధారించి సిజేరియన్ చేసి ఐదు పిల్లలను వెలికి తీశారు. ప్రస్తుతం తల్లి కుక్క కోలుకుంటోంది. సకాలంలో కుక్కకు సిజేరియన్ చేసి ప్రాణాలు కాపాడిన డాక్టర్ పద్మనాభం, డాక్టర్ రమేష్, సంచార పశువైద్యశాల డాక్టర్ సునీతకు రైతు భాస్కరరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

నగదు పట్టివేత

మడకశిర: మండలంలోని యు.రంగాపురం చెక్‌పోస్టులో ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.1.99లక్షల నగదును సీజ్ చేసినట్లు డిప్యూటీ తహసీల్దార్ బాలాంజనేయులు తెలిపారు. శుక్రవారం ఉదయం ఓ కారులో ఇద్దరు వ్యక్తులు తుమకూరు నుంచి పావగడకు వెళుతూ చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు, రెవెన్యూ అధికారులు చేపట్టిన తనిఖీల్లో పట్టుబడ్డారన్నారు. నగదుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో సీజ్ చేసినట్లు వివరించారు.

అన్న చేతిలో తమ్ముడు హతం

గుంతకల్లు రూరల్: చిన్నపాటి విషయానికి చోటు చేసుకున్న గొడవలో చివరకు అన్న చేతిలో తమ్ముడు హత్యకు గురయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... గుంతకల్లు మండలం నాగసముద్రం గ్రామానికి చెందిన నాగిరెడ్డి, నారాయణమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. పుట్టుకతోనే చెవుడు, మూగ కావడంతో పెద్ద కుమారుడు నారాయణరెడ్డికి తల్లిదండ్రులు వివాహం చేయలేకపోయారు. మరో కుమారుడు రామకృష్ణారెడ్డికి గుంతకల్లు మండలం సంగాల గ్రామానికి చెందిన శ్రీవాణితో వివాహమైంది. కుమార్తె బాలమ్మకు సొంతూరిలోనే పెద్దిరెడ్డి అనే వ్యక్తికి ఇచ్చి పెళ్లి చేశారు. కొన్ని రోజులుగా అన్నదమ్ములిద్దరూ మద్యానికి బానిసలయ్యారు. భర్త రామకృష్ణారెడ్డి ప్రవర్తనతో విసుగు చెందిన శ్రీవాణి ఇటీవల అతడిని వదిలి పుట్టింటికి వెళ్లిపోయింది. గురువారం దివ్యాంగుల పింఛన్ సొమ్ము అందుకున్న నారాయణరెడ్డి, తన బావ పెద్దిరెడ్డితో కలసి ఇంట్లోనే మందు పార్టీ ఏర్పాటు చేసుకున్నాడు. కాసేపటి తర్వాత మద్యం మత్తులో ఇద్దరూ గొడవపడ్డారు. అసహనానికి గురైన నారాయణరెడ్డి వండిన ఆహారాన్ని బయట పడేసి ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. ఈ విసయాన్ని తన చిన్న బామ్మర్ది రామకృష్ణారెడ్డితో చెప్పి పెద్దిరెడ్డి బాధపడ్డాడు. దీంతో రామకృష్ణారెడ్డి తన అన్న నారాయణరెడ్డి వద్దకెళ్లి మందలిస్తూ చేయి చేసుకున్నాడు. తమ్ముడిపై ఆగ్రహంతో పీకలదాకా మద్యం తాగిన నారాయణరెడ్డి గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఇంటి ఆవరణలో గడ్డివామి వద్ద మంచంపై నిద్రిస్తున్న రామకృష్ణారెడ్డిపై కర్రతో విచక్షణారహితంగా దాడి చేశాడు. ఘటనలో రామకృష్ణారెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న గుంతకల్లు రూరల్ ఎస్ఐ సురేష్ శుక్రవారం ఉదయం అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

వైఎస్సార్‌సీపీకే సంపూర్ణ మద్దతు

- రాయలసీమ యునైటెడ్ ఫోర్స్ రాష్ట్ర అధ్యక్షుడు తిప్పిరెడ్డి నాగార్జున రెడ్డి



మాట్లాడుతున్న నాగార్జునరెడ్డి

అనంతపురం: శ్రీబాగ్ ఒడంబడిక మేరకు రాయలసీమకు ప్రాధాన్యత కల్పించేలా కర్నూలులో న్యాయ రాజధాని ఏర్పాటుకు కృషి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రాయలసీమ యునైటెడ్ ఫోర్స్ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందని ఫోర్స్ రాష్ట్ర అధ్యక్షుడు తిప్పిరెడ్డి నాగార్జున రెడ్డి స్పష్టం చేశారు. రాయలసీమ సమగ్రాభివృద్ధికి, అధికార వికేంద్రీకరణకు కృషి చేస్తున్న వైఎస్సార్‌సీపీకే తమ మద్దతు అని ఆయన ప్రకటించారు. అనంతపురంలోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నీటి ప్రాజెక్ట్‌ల అంశంలోనూ రాయలసీమకు సీఎం వైఎస్ జగన్ అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నారని ప్రశంసించారు. సంక్షేమ పథకాల వల్ల పేద, మధ్య తరగతి కుటుంబాల ఆర్థిక స్థితిగతులు మెరుగుపడేలా చేశారన్నారు. దీంతో రాయలసీమ ప్రాంతంలో వలసలు తగ్గి ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయన్నారు. సచివాలయ, వలెంటీర్ల వ్యవస్థల ద్వారా పీడిత వర్గాల ప్రజలకు నేరుగా పథకాలు అందించేలా చర్యలు తీసుకోవడం చరిత్రాత్మకమన్నారు. రాష్ట్రంలో ప్రజలకు నేరుగా నగదు బదిలీ వ్యవస్థ (డీబీటీ) ద్వారా రూ.2.50 లక్షల కోట్ల పంపిణీ మరే రాష్ట్రంలోనూ లేదని ప్రశంసించారు. మన బడి–నాడు–నేడు కార్యక్రమం, ప్రభుత్వ బడుల్లో ఇంగ్లిష్ మీడియం అమలు, అమ్మ ఒడి పథకం, పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన, విదేశీ విద్యా దీవెన, 17 మెడికల్ కళాశాలల నిర్మాణం వంటి విప్లవాత్మకమైన కార్యక్రమాల అమలుతో మిగతా రాష్ట్రాలకు స్ఫూర్తిదాయకంగా ఏపీని నిలబెట్టిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రజలకు మంచి చేసిన సీఎం వైఎస్ జగన్‌తోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని, దీంతో ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకే రాయలసీమ యునైటెడ్ ఫోర్స్ సంపూర్ణ మద్దతు తెలుపుతోందన్నారు. కార్యక్రమంలో ఫోర్స్ ప్రతినిధులు పుట్లూరు భాస్కరరెడ్డి, చుక్కలూరు రామానందరెడ్డి, ఆర్.సుధాకర్, కనకం నాగరాజు, వరుణ్, వి.గోపాల్ కృష్ణ, నూర్ మహమ్మద్, చాంద్‌బాషా, యక్కలూరు రంగనాయకులు, ఆర్.ప్రసాదరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పార్టీ సభ్యత్వానికి మూకుమ్మడి రాజీనామా

- ఏపీ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ బాలాజీ మనోహర్
- నేడు సీఎం వైఎస్ జగన్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిక



మాట్లాడుతున్న బాలాజీ మనోహర్

హిందూపురం: గడ్డు కాలంలోనూ పార్టీని వీడకుండా దాదాపు మూడు దశాబ్దాల పాటు ఎన్నో ఒడిదుడుకులు ఓర్చుకుని అండగా నిలిస్తే చివరకు తమకు విలువ లేకుండా చేసారని కాంగ్రెస్ అధిష్టానంపై ఆ పార్టీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ టి.బాలాజీ మనోహర్ ధ్వజమెత్తారు. హిందూపురంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. బాలాజీ మనోహర్‌తో పాటు సీనియర్ నాయకుడు ఆదిమూర్తి, ఏ బ్లాక్ ప్రెసిడెంట్ అమానుల్లా, గంగాధరప్ప లేపాక్షి మండల అధ్యక్షుడు గంగాధరప్ప, అన్సర్, దాసన్న మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ టిక్కెట్ల కేటాయింపు విషయంలో ఇంత కాలం ఎవరికో ఇస్తే వారి కోసం పని చేస్తూ వచ్చామన్నారు. మనసు చంపుకుని ఇంకెంత కాలం తాము ఇలా పనిచేయాలని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధిష్టానం నిరంకుశ ధోరణి సహించలేక పార్టీకి రాజీనామా చేసి వైదొలుగుతున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన రాజీనామా పత్రాలను చూపిస్తూ వాటిని పీసీసీ చీఫ్ షర్మిలకు పంపుతున్నట్లు పేర్కొన్నారు. అలాగే శనివారం హిందూపురంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో తామంతా వైఎస్సార్‌సీపీలో చేరుతున్నట్లు ప్రకటించారు. ఈ విషయంగా ఇప్పటికే మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో సంప్రదింపులు జరిగినట్లు వివరించారు. హిందూపురం సమగ్రాభివృద్ధిని కోరుకుంటూ తామంతా ఏకతాటిపైకి వచ్చి వైఎస్సార్‌సీపీలోకి చేరుతున్నట్లు స్పష్టం చేశారు.

రెచ్చిపోయిన టీడీపీ అల్లరిమూక

- ట్రాక్టరు, బైక్ స్వాధీనం చేసుకున్న పోలీసులు

యల్లనూరు: శింగనమల నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి బండారు శ్రావణి ఎన్నికల ప్రచారంలో టీడీపీ అల్లరిమూక రెచ్చిపోయింది. దీంతో ప్రశాంతంగా ఉన్న యల్లనూరు మండలం గొడ్డుమర్రి గ్రామంలో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. వివరాలు... శుక్రవారం ఉదయం గొడ్డుమర్రిలో బండారు శ్రావణి ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఆ సమయంలో టీడీపీకి చెందిన అల్లరి మూకలు ట్రాక్టర్లు, ద్విచక్రవాహనాలకు సైలెన్సర్లు తీసేసి హల్‌చల్ చేశారు. విపరీతమైన శబ్ద కాలుష్యానికి స్థానికులు బెంబేలెత్తిపోయారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ గిరిబాబు, సిబ్బంది అక్కడకు చేరుకుని ట్రాక్టరు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో మెడికో దుర్మరణం

- మరో ఇద్దరి పరిస్థితి విషమం



మృతి చెందిన షేక్‌జానీ

మల్కాపురం (విశాఖ జిల్లా): ఎన్నో ఆశలు.. భవిష్యత్తులో వైద్యులుగా స్థిరపడాలని కలలుగన్నారు. చదువుల కోసం జిల్లాలు దాటి విశాఖ వచ్చారు. శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక మెడికో మృతి చెందగా.. మరో ఇద్దరు ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్నారు. వివరాలు ఇలా.. గుంటూరు జిల్లా పిడుగురాళ్ల ప్రాంతానికి చెందిన షేక్‌జానీ(19), అనంతపురం ప్రాంతానికి చెందిన సత్యకుమార్, శ్రీకాకుళానికి చెందిన ప్రమోద్‌లు కొమ్మదిలోని గాయత్రి మెడికల్ కళాశాలలో మెడిసిన్ ప్రథమ సంవత్సరం చదువుతున్నారు. ఈ ముగ్గురు ఒకే ద్విచక్రవాహనంపై యారాడ, గంగవరం బీచ్‌కు శుక్రవారం తెల్లవారుజామున బయలుదేరారు. మల్కాపురం పోలీసు స్టేషన్ రోడ్డు నుంచి సింధియా వైపు వెళుతుండగా షిప్‌యార్డ్ కమర్షియల్ కాంప్లెక్స్ సమీపంలో ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో షేక్‌జానీ అక్కడికక్కడే దుర్మరణం చెందారు. సత్యకుమార్, ప్రమోద్ తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రాంతంలో డివైడర్ పనులు జరుగుతున్నాయి. తవ్విన వ్యర్థాలను తరలించేందుకు అక్కడ ట్రాక్టర్ వచ్చింది. ఇది గుర్తించలేని యువకులు ట్రాక్టర్‌ను ఢీకొట్టారు. తీవ్రంగా గాయపడిన వారిని కేజీహెచ్‌లో చేర్పించారు. ప్రస్తుతం వారి పరిస్థితి విషమంగా ఉంది.

బ్రెయిన్ ట్యూమర్‌తో ఉపాధ్యాయుడి మృతి



నేలకోటప్ప (ఫైల్)

చెన్నేకొత్తపల్లి: మండలంలోని కనుముక్కల గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు నేలకోటప్ప (44) బ్రెయిన్ ట్యూమర్‌తో శుక్రవారం మృతి చెందారు. గ్రామస్తులు తెలిపిన మేరకు... పుట్టపర్తి మండలం కొండకమర్ల అమ్మవారుపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న నేలకోటప్ప కొంత కాలంగా బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్నారు. ఈ క్రమంలో ఆస్పత్రిలో చికిత్స చేయించుకుని వచ్చిన ఆయన శుక్రవారం పరిస్థితి విషమించి ఇంటి వద్దనే మృతి చెందారు. 1998లో డీఎస్సీలో అర్హత సాధించిన ఆయన ఎనిమిది నెలల క్రితం ఉపాధ్యాయ వృత్తిలో చేరారు. మృతునికి భార్య పావని, కుమారుడు ఉన్నారు. విషయం తెలుసుకున్న స్థానిక వైఎస్సార్‌సీపీ నేత సానే రాజారెడ్డి బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. నేలకోటప్ప మృతదేహానికి పూల మాల వేసి నివాళులర్పించారు.

కారు డ్రైవింగ్, బైక్ రిపేరీపై ఉచిత శిక్షణ

అనంతపురం: రూడ్‌సెట్ సంస్థలో యువకులకు కారు డ్రైవింగ్, బైక్ రిపేరీపై ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు ఆ సంస్థ డైరెక్టర్ విజయలక్ష్మి శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 20వ తేదీ నుంచి నెల రోజుల పాటు శిక్షణ ఉంటుంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో గ్రామీణ ప్రాంతానికి చెందిన వారు అర్హులు. ఆసక్తి ఉన్న వారు ఆధార్, రేషన్ కార్డుతో దరఖాస్తు చేసుకోవాలి. శిక్షణా సమయంలో ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తారు. పూర్తి వివరాలకు 83099 15577, 96188 76060లో సంప్రదించవచ్చు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ప్రతిభ

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం–ఓటీపీఆర్ఐ విద్యార్థులు క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ప్రతిభ కనబరిచారు. 2023–24 విద్యా సంవత్సరంలో బీఫార్మసీ పూర్తి చేసిన శుక్రవారం విద్యార్థులకు క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం 130 మంది విద్యార్థులు ఇంటర్వ్యూలకు హాజరుకాగా.. ఏకంగా 67 మంది విద్యార్థులకు దివీస్ ల్యాబొరేటరీలో కొలువులు దక్కాయి. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను ఓటీపీఆర్ఐ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.దుర్గాప్రసాద్ అభినందించారు.

వీవీప్యాట్‌లో గుర్తు తప్పగా చూపితే...



అనంతపురం అర్బన్: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఈవీఎంలో ఓటరు తాను వేసిన గుర్తుకే ఓటు పడిందా లేదా అని నిర్ధారించుకునేందుకు వీవీప్యాట్‌లో పేపర్ ప్రింట్ ద్వారా పరిశీలించుకోచ్చు. తాను ఓటు వేసిన గుర్తు ఒకటైతే వీవీప్యాట్‌లో మరో గుర్తుకు పడినట్లు తప్పు ప్రింట్ చూపిస్తే దానిని 'రాంగ్ ప్రింట్ ఆఫ్ వీవీప్యాట్ పేపర్ స్లిప్' అంటారు. ఇలాంటి సందర్భంలో ప్రిసైడింగ్ అధికారి రూల్ 49ఎంఏ ప్రకారం చర్యలు తీసుకోవాలి. అలాగే...

- తన వద్ద ఉన్న హ్యాండ్ బుక్‌లోని అనెక్జర్–15 ప్రకారం ఫిర్యాదు చేసిన ఓటరు వద్ద డిక్లరేషన్‌ను ప్రిసైడింగ్ అధికారి తీసుకోవాలి.
- పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో 17ఎ లో ఓటరు వివరాలు మరోసారి ఎంటర్ చేయాలి.
- కంట్రోల్ యూనిట్ నుంచి ఓటును విడుదల చేయాలి. ఏజెంట్ల సమక్షంలో ప్రిసైడింగ్ అధికారి వీవీప్యాట్‌లో వచ్చిన స్లిప్‌ను పరిశీలించాలి.
- ఓటరు ఫిర్యాదు నిజమని తేలితే... ప్రిసైడింగ్ అధికారి పోలింగ్‌ను ఆపేసి రిటర్నింగ్ అధికారికి తెలియజేయాలి.
- ఓటరు ఫిర్యాదు తప్పని తేలితే 17ఎ లో ఆ ఓటరు రెండోసారి రాసిన వివరాలు రిమార్క్ కాలమ్‌లో ఓటరు చేసిన ఫిర్యాదు తప్పని రాయాలి.
- 17 సి అనగా పోలైన ఓట్ల వివరాలు తెలిపే ఫారంలోని మొదటి భాగంలో (పార్ట్–1) ఆ వివరాలు నమోదు చేయాలి.



వీవీ ప్యాట్

ఈవీఎంలు, వీవీప్యాట్‌లు పనిచేయకపోతే

- పోలింగ్ సమయంలో ఈవీఎంలు, వీవీప్యాట్‌లు పనిచేయకపోతే.. వాటి స్థానంలో రిజర్వ్‌లోని వాటిని ఏర్పాటు చేయాలి.
- కొత్త ఈవీఎం, వీవీప్యాట్‌లో మళ్లీ మాక్‌పోల్ నిర్వహించి, డిక్లరేషన్ రాయాలి (సింగిల్ ఓటు).

మార్క్‌డ్ ఓటరు వస్తే...

- ప్రిసైడింగ్ అధికారి వద్ద ఓటరు జాబితాకు సంబంధించి వర్కింగ్ కాపీలు, మార్క్‌డ్ కాపీలు ఉంటాయి. అందులో ఆబ్సెంట్, షిఫ్టెడ్, డెత్ (ఏఎస్‌డీ)జాబితాలో ఉన్న ఓటర్లను మార్క్ చేసి ఉంటారు.
- మార్క్‌డ్ ఓటరు ఓటు వేయడానికి వస్తే ప్రిసైడింగ్ అధికారి ఆ ఓటరు తెచ్చిన గుర్తింపుతో జాబితాలోని వివరాలను సరిచూడాలి.
- నిజమైతే 17ఎ లో ఆ ఓటరు సంతకంతో పాటు వేలిముద్ర తీసుకుని ఓటు వేసేందుకు అనుమతించాలి.
- ఏఎస్‌డీ జాబితా నుంచి ఓటు వేసిన వారి వివరాలతో ఓ రికార్డు సిద్ధం చేయాలి.

టీడీపీ ప్రచారంలో ఉద్యోగులు



పరిటాల సునీత సమక్షంలో టీడీపీలోకి చేర్పిస్తున్న పరుశురాం



పరిటాల సునీత ప్రచారంలో పాల్గొన్న పోతులయ్య

రాప్తాడు రూరల్: ఎన్నికల కమిషన్ నిబంధనలకు విరుద్ధంగా కొందరు ప్రభుత్వ ఉద్యోగులు వ్యవహరిస్తున్న తీరు చర్చనీయాశమైంది. వివరాలు... అనంతపురం రూరల్ మండలం కొడిమి గ్రామానికి చెందిన బండి పోతులయ్య ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఎంఎన్‌ఓ (ఫిమేల్ నర్సింగ్ ఆర్డర్లీ)గా పని చేస్తున్నారు. అలాగే కామారుపల్లికి చెందిన పరుశురాం ఎంఎస్‌డబ్ల్యూ (మేల్ సోషల్ వర్కర్)గా పని చేస్తున్నారు. వీరిద్దరూ ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా టీడీపీ అభ్యర్థి పరిటాల సునీత ప్రచార కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. ఇటీవల పరుశురాం ఏకంగా పరిటాల సునీత ఇంటి వద్దకు కొందరిని పిలుచుకెళ్లి ఆయన ఆధ్వర్యంలో పార్టీలో చేర్పించారు. వీరి తీరు చర్చనీయాంశమైంది.

క్లుప్తంగా

న్యాయమూర్తిగా బొజ్జప్ప బాధ్యతలు



బాధ్యతలు స్వీకరించిన న్యాయమూర్తికి స్వాగతం పలుకుతున్న న్యాయవాదులు

పెనుకొండ: పెనుకొండ సీనియర్ సివిల్ జడ్జిగా బొజ్జప్ప శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న సీనియర్ సివిల్ జడ్జి శంకరయ్య ఇటీవల అనంతపురానికి బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో బొజ్జప్ప పెనుకొండకు బదిలీపై వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన న్యాయమూర్తిని స్థానిక న్యాయవాదులు నాగరాజు, వాల్మీకి శ్రీనివాసులు, అశ్వర్థనారాయణ, నాగిరెడ్డి, జావిద్ తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. న్యాయమూర్తి బొజ్జప్ప మాట్లాడుతూ కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. అదేవిధంగా న్యాయ సేవా అధికార సంస్థ ద్వారా లోక్అదాలత్‌లను సమర్థవంతంగా నిర్వహించి కేసుల రాజీకి కృషి చేస్తామని వెల్లడించారు.

వైఎస్సార్‌సీపీ శ్రేణులతో నేడు మంత్రి సమావేశం

పెనుకొండ: మంత్రి ఉషశ్రీచరణ్ నేతృత్వంలో పట్టణంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ శ్రేణుల సమావేశం నిర్వహిస్తున్నట్లు మంత్రి కార్యాలయ వర్గాలు ఒక ప్రకటన విడుదల చేసింది. ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని, సమావేశానికి వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లు, పార్టీ ముఖ్య నాయకులు హాజరుకావాలని కోరారు.

మారాల మాజీ సర్పంచు మృతి



నారాయణరెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి: బుక్కపట్నం మండలం మారాల మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, మండల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి తండ్రి నారాయణరెడ్డి(84) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, హిందూపురం ఎంపీ అభ్యర్థి బోయ శాంతమ్మ గ్రామానికి చేరుకుని నారాయణరెడ్డి మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. సుధాకర్‌రెడ్డి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. నారాయణరెడ్డి 2013లో మారాల సర్పంచుగా పని చేశారు.

ఓడీచెరువు: బత్తినపల్లికి చెందిన కిష్టయ్య (55)అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి తనయుడు కిషన్ రెడ్డి కిష్టయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

శ్రీధర్‌రెడ్డిని గెలిపించండి



ప్రచారం చేస్తున్న దుద్దుకుంట అపర్ణారెడ్డి

పుట్టపర్తి రూరల్: పుట్టపర్తి అభివృద్ధికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డిని మరోసారి గెలిపించాలని ఎమ్మెల్యే సతీమణి దుద్దుకుంట అపర్ణారెడ్డి కోరారు. శుక్రవారం మున్సిపాలిటీలోని 3,4,5 వార్డుల్లో అమె ప్రచారం నిర్వహించారు. స్థానికులు పూలు చల్లుతూ, హారతులు పడుతూ ఆమెకు ఘన స్వాగతం పలికారు. ఇంటింటికీ తిరిగి ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు.



తెలుగు రాష్ట్రాల్లోనే అతిపెద్ద చెరువు

నియోజకవర్గంలో బుక్కపట్నం చెరువుకు ప్రత్యేక స్థానం ఉంది. 11 శతాబ్దంలో హరి హర బుక్కరాయలు ఈ చెరువును తవ్వారు. ఇది ఉమ్మడి రాష్ట్రంలో అతి పెద్ద చెరువుల్లో రెండవది. 0.75 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం ఉన్న ఈ చెరువు కింద ప్రత్యక్షంగా 3,300 ఎకరాలు, పరోక్షంగా మరో 3 వేల ఎకరాల ఆయకట్టు సాగులో ఉంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చెరువు కింద ఆయకట్టుకు నీరు వదలటంతో పంటలు సమృద్ధిగా పండుతున్నాయి.

పుట్టపర్తి బరిలో 12 మంది

పుట్టపర్తి శాసనసభ స్థానానికి 12 మంది బరిలో ఉన్నట్లు అధికారులు ప్రకటించారు. ఇందులో వైఎస్సార్‌సీపీ తరఫున దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, టీడీపీ పల్లె సింధూరరెడ్డి, కాంగ్రెస్ మధుసూదన్ రెడ్డి, మరో 9 మంది స్వతంత్రులు బరిలో ఉన్నారు.

సత్యసాయి కీర్తి.. సంక్షేమ కాంతి

- ఒక నాటి గొల్లపల్లి.. నేటి పుట్టపర్తి
- సత్యసాయి నడయాడిన నేల
- ఆధ్యాత్మిక ధామం ప్రశాంతి నిలయంతో ప్రపంచ ఖ్యాతి
- జిల్లా ఏర్పాటుతో అభివృద్ధి పరుగులు
- సంక్షేమ పథకాలతో జనం సుభిక్షం

పుట్టపర్తి: ఒక నాటి గొల్లపల్లి నేడు ప్రపంచ ప్రసిద్ధి చెందిన పుట్టపర్తిగా వర్ధిల్లుతోంది. ప్రపంచ పర్యాటకులతో నిత్యం రద్దీగా ఉంటోంది. 1,900 సంవత్సరం కాలంలో పుట్టపర్తి చిన్న కుగ్రామం. 1950 తర్వాత పుట్టపర్తి దశ మారింది. అప్పుడే సత్యనారాయణ అనే బాలుడు వెలుగులోకి వచ్చారు. భగవాన్ సత్యసాయి బాబాగా అవతరరించాడు. అనంతరం ఏటికేడు పుట్టపర్తి వేగవంతంగా అభివృద్ధి చెందింది. సత్యసాయి సందేశంతో 100 దేశాలకుపైగా విదేశీయులు ప్రశాంతి నిలయానికి వచ్చి వెళ్తున్నారు. దీంతో పుట్టపర్తి అనతికాలంలోనే ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రంగా గుర్తింపు పొందింది.

జిల్లా ఏర్పాటుతో మారిన దశ

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సౌలభ్యం కోసం కొత్త జిల్లాలను ఏర్పాటు చేశారు అందులో భాగంగా సత్యసాయి బాబా నడయాడిన పుట్టపర్తి కేంద్రంగా శ్రీసత్యసాయి జిల్లాగా ప్రకటించారు. దీంతో నియోజకవర్గ దశ మారింది. ఆరు మండలాల్లోనూ అభివృద్ధి కొత్త పుంతలు తొక్కింది.

2009లో నియోజకవర్గంగా రూపాంతరం

నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా 2009లో పుట్టపర్తి అసెంబ్లీ నియోజకవర్గం ఆవిర్భవించింది. అంతకుమందు పుట్టపర్తి, బుక్కపట్నం, కొత్తచెరువు మండలాలు గోరంట్ల నియోజకవర్గంలో ఉండేవి. పునర్విభజనలో నల్లమాడ నియోజకవర్గం రద్దుకాగా, కొత్తగా పుట్టపర్తి పుట్టుకువచ్చింది.

నియోజకవర్గ స్వరూపం

పుట్టపర్తి నియోజకవర్గం పరిధిలో పుట్టపర్తి, బుక్కపట్నం, కొత్తచెరువు, నల్లమాడ, ఓడీచెరువు, అమడగూరు మండలాలు ఉన్నాయి. ఇందులో నల్లమాడ, ఓడీచెరువు, అమడగూరు మండలాలు 2009 సంవత్సరానికి ముందు నల్లమాడ నియోజకవర్గంలో ఉండేవి. పుట్టపర్తి నియోజకవర్గం తూర్పున కదిరి, పడమర పెనుకొండ, ఉత్తరాన ధర్మవరం, రాప్తాడు, దక్షిణాన పెనుకొండ నియోజకవర్గాలు ఉన్నాయి.

రాజకీయ పరిణామాలు

▸▸ 2009లో తొలిసారి పుట్టపర్తి అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా కడపల మోహన్‌రెడ్డి, టీడీపీ అభ్యర్థిగా పల్లె రఘునాథరెడ్డి పోటీ పడ్డారు. ఈ ఎన్నికల్లో పల్లె రఘునాథరెడ్డి విజయం సాధించారు. కడపల మోహన్‌రెడ్డిపై 1,600 ఓట్ల తేడాతో గెలుపొందారు.

▸▸ 2014లో జరిగిన ఎన్నికల్లో సైతం టీడీపీ అభ్యర్థిగా పల్లె రఘునాథరెడ్డి బరిలోకి దిగారు. ఆ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థి కొత్తకోట సోమశేఖర్‌రెడ్డిపై 5,600 ఓట్ల తేడాతో విజయం సాధించారు.

▸▸ 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి... టీడీపీ అభ్యర్థిగా పల్లె రఘునాథరెడ్డి బరిలోకి దిగారు. ఈ ఎన్నికల్లో పల్లె రఘునాథరెడ్డిని దుద్దుకుంట మట్టికరిపించారు. ఏకంగా 32,000 ఓట్ల మెజార్టీతో విజయకేతనం ఎగుర వేశారు.

నియోజకవర్గ ప్రత్యేకతలు

సత్యసాయి బాబా నడయాడిన ప్రశాంతి నిలయం ఆధ్యాత్మిక కేంద్రంగా ప్రపంచ గుర్తింపు పొందింది. లక్షలాదిగా సత్యసాయి భక్తులు, పర్యాటకులతో నిత్యం రద్దీగా ఉంటుంది. జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయటం. రైల్వే స్టేషన్, విమానాశ్రయం అందుబాటులో ఉండటం, విద్యా, వైద్యం పరంగా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, విద్య పరంగా సత్యసాయి లోయర్, హయ్యర్, డీమ్డ్ విద్యాలయాలు, విశ్వ విద్యాలయం ఉండటం.

- జిల్లాలోనే ఎక్కడాలేని విధంగా పుట్టపర్తిలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన మైదానం ఉంది.
- పుట్టపర్తి, బుక్కపట్నం, కొత్తచెరువు మధ్యలో ట్యాంకు బండ్‌లా బుక్కపట్నం చెరువు పర్యాటకులను ఆకర్షిస్తోంది.

ఓటర్ల వివరాలు

2,16,635 ప్రస్తుతం నియోజకవర్గ మొత్తం ఓటర్లు

మొత్తం పోలింగ్ స్టేషన్‌లు 238

పురుష ఓటర్లు 1,06,788

ఇతరులు 12

మహిళ ఓటర్లు 1,09,835

గ్రామ/వార్డు సచివాలయాలు	77
పశువుల ఆస్పత్రులు	16
ప్రభుత్వ ఆస్పత్రులు	9
సీహెచ్‌సీలు	2
రైతు భరోసా కేంద్రాలు	61



సంక్షేమ పథకాల ద్వారా నియోజకవర్గానికి కలిగిన లబ్ధి ఇలా... (జూన్ 2019 నుంచి జూన్ 2023 వరకు)

పథకం పేరు	లబ్ధిదారులు	లబ్ధి(రూ.కోట్లలో)
వైఎస్సార్ పింఛన్ కానుక	43,427	664.97
వైఎస్సార్ రైతు భరోసా	45,824	290.74
పేదలందరికి ఇళ్లు	18,736	116.27
సున్నా వడీ రుణాలు (క్రాప్‌లోన్)	40,451	12.76
వైఎస్సార్ ఉచిత పంటల బీమా	67,045	78.8
ఇన్‌పుట్ సబ్సిడీ	1,401	3.9
జగనన్న తోడు రూరల్	4,544	13.15
వైఎస్సార్ ఆసరా రూరల్	3610	109.63
వైఎస్సార్ సున్నా వడ్డీపొదుపుసంఘాలకు	4,982	33.10
వైఎస్సార్ చేయూత రూరల్	16,633	111.72
వైఎస్సార్ భీమా	106	5.83
జీవనోపాధి కోసం పొదుపు సంఘాలకు	4,127	644.64
వైఎస్సార్ ఆసరా పట్టణ	4,743	14.70
వైఎస్సార్ సున్నా వడ్డీ పట్టణ	6,418	4.49
వైఎస్సార్ చేయూత పట్టణ	1,483	7.64
ఉపాధి కోసంపట్టణ పొదుపు సంఘాలకు	2,730	81.53
జగనన్న తోడు పట్టణ	640	3.10
జగనన్న అమ్మఒడి	23,483	133.32
జగనన్న విద్యా కానుక	22,981	8.85
జగనన్న వసతి దీవెన	6,729	25.35
జగనన్న విద్యా దీవెన	6,852	47.74
ఆరోగ్యశ్రీ	6,954	3.38
వైఎస్సార్ నేతన్న నేస్తం	411	4.33
జగనన్న చేదోడు	2,053	7.18
వైఎస్సార్ ఈబీసీ నేస్తం	3,456	9.78
వైఎస్సార్ కాపు నేస్తం	1,592	8.80
మైనారిటీల సంక్షేమానికి	34	2.65
వైఎస్సార్ వాహన మిత్ర	1,130	4.89
దేవదాయ శాఖ అర్చకులు	13	0.013

విజయమే లక్ష్యంగా పనిచేయండి



బూత్ కమిటీ కన్వీనర్లతో సమావేశమైన మంత్రి ఉషశ్రీచరణ్



పార్టీలో చేరిన వారితో మంత్రి ఉషశ్రీచరణ్

- మంత్రి ఉషశ్రీచరణ్

గోరంట్ల: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ ఐకమత్యంతో పనిచేయాలని మంత్రి, పెనుకొండ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీచరణ్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల పరిధిలోని వానవోలు, వానవోలు తండా, గోరంట్ల మేజర్ పంచాయతీ పరిధిలోని బూత్ కమిటీ కన్వీనర్లు, పార్టీ ముఖ్యనాయకులు, కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీ కుటుంబ సభ్యులు ఐకమత్యంతో ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేసి పార్టీ విజయం కోసం కృషిచేయాలన్నారు. ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు అందించిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి, తాజాగా విడుదల చేసిన ఎన్నికల మేనిఫెస్టోను ప్రజలకు అర్థమయ్యేలా వివరించి ఫ్యాను గుర్తుకు ఓటు వేసేలా చూడాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, టౌన్ కన్వీనర్ ధనుంజయరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు పాలేజయరాంనాయక్, ముఖ్యనాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు బూత్ కమిటీ కన్వీనర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక

గోరంట్ల మండల పరిధిలోని బాలన్నగారిపల్లి గ్రామానికి చెందిన ఇరవై కుటుంబాలు శుక్రవారం మంత్రి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీచరణ్ సమక్షంలో తెలుగు దేశం పార్టీ నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. పార్టీలోకి చేరిన వారిలో పురుషోత్తమరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, నరసింహరెడ్డి, బీమిరెడ్డి, నాగిరెడ్డి తదితరులు న్నారు. ఈ సందర్భంగా వారందరికీ మంత్రి ఉషశ్రీ కండువ కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో నార్సింపల్లి మాజీ సర్పంచ్ శివారెడ్డి, బూదిలి సింగిల్ విండో అధ్యక్షుడు రాఘురామిరెడ్డి, పాలసముద్రం సర్పంచ్ కాటిపల్లి గంగప్ప, పార్టీ ముఖ్యనాయకులు బాలన్నగారిపల్లి శివారెడ్డి, ఆదినారాయణరెడ్డి, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నయ వంచకుడు చంద్రబాబును నమ్మరు





రోడ్ షోకు హాజరైన జనం, మాట్లాడుతున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి చిత్రంలో శాంతమ్మ

- ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

కొత్తచెరువు: తప్పుడు హామీలతో ముందుకొస్తున్న నయ వంచకుడు చంద్రబాబును ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మర ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పోతులకుంట, మరకుంటపల్లి, తలమర్ల గ్రామాల్లో ఎంపీ అభ్యర్థి బోయ శాంతమ్మ, స్థానిక నాయకులతో కలిసి భారీ రోడ్ షో నిర్వహించారు. తలమర్లలో 80 ట్రాక్టర్లతో రైతులు ర్యాలీగా వెళ్లి స్వాగతం పలికారు. ఈసందర్భంగా ఆయనకు అయా గ్రామాల్లో ప్రజలు పూలమాలు, మహిళలు హారతులతో పూలవర్షంతో ఘనస్వాగతం పలికారు. వేలాదిగా జనం తరలివచ్చారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న పాలన స్వర్ణయుగాన్ని తలపిస్తోందన్నారు. 2014 ఎన్నికలలో చంద్రబాబు 600పైగా హామీలిచ్చి ఏ ఒక్కటీ నెరవేర్చలేదన్నారు. ఇప్పుడు మరోసారి ఆచరణ సాధ్యం కాని హామీలు ప్రకటించారన్నారు. ప్రతినెలా 1న వలంటీర్ల ద్వారా ఫించన్ రావలన్నా, అమ్మఒడి, వైఎస్సార్ ఆసరా, చేయూత, కాపునేస్తం, వాహనమిత్ర, నేతన్న నేస్తం, ఈబీసీ నేస్తం రావాలన్నా జగనన్నను సీఎం చేసుకోవాలన్నారు.

193 చెరువులు నింపుతాం

హంద్రీ-నీవా కాలువ ద్వార నియోజకవర్గంలోని 193 చెరువులకు నీరు నింపు పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని, 6 నెలల్లో పనులు పూర్తిచేసి ప్రతి చెరువును నింపుతామని ఎమ్మెల్యే ప్రకటించారు. చంద్రబాబు, కరువు కవల పిల్లలని ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి ఎద్దేవా చేశారు. చంద్రబాబు అడుగుపెడితే వర్షాలు రావని, ఎన్నికలు ముగిసాక హైదరాబాద్ ఇంట్లో విశ్రాంతి తీసుకోవాలని సూచించారు.

బీసీలను గుర్తించింది వైఎస్సార్‌సీపీనే

హిందూపురం పార్లమెంట్ అభ్యర్థి శాంతమ్మ మాట్లాడుతూ బీసీలను గుర్తించి అనేక పదవులు నామినేటడ్ పోస్టులు ఇచ్చింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి బీసీలు రుణపడి ఉండాలన్నారు. ఫ్యాను గుర్తుకు ఓటేసి మరోసారి జగనన్నను ఆశీర్వదించాలన్నారు. మండల కన్వీనర్ నారేపల్లి జగన్‌మోహన్‌రెడ్డి, మండల పరిశీలకుడు ఆవుటాల రమణారెడ్డి, ఎంపీపీ గాయత్రీ రెడెప్పరెడ్డి, జెడ్పీటీసీ గంగాదేవి శంకర్, మాజీ సర్పంచ్ శ్యాంసుందర్‌రెడ్డి, సర్పంచ్ మమత రామసుబ్బయ్య, యోగానందరెడ్డి, ఎంపీటీసీ కృష్ణారెడ్డి తదితరనాయకులు పాల్గొన్నారు.

సకాలంలో రెన్యూవల్ చేసుకోండి

అమడగూరు: పంట రుణాలను రైతులు సకాలంలో రెన్యూవల్ చేసుకోవాలని అమడగూరు ఏపీజీబీ సిబ్బంది కోరారు. శుక్రవారం వారు మాట్లాడుతూ పంచాయతీల వారీగా రెన్యూవల్ చేస్తున్నామన్నారు. రైతులు గతేడాది రెన్యూవల్ చేసిన రోజుకు రెండు రోజుల ముందుగా వడ్డీ చెల్లించి రెన్యూవల్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. బ్యాంకు సుమారు 3,900 మంది రైతులు రుణాలను తీసుకున్నారని, ప్రభుత్వ ఆదేశాల మేరకు జూన్ 30లోపు రుణాలను రెన్యూవల్ చేస్తామన్నారు.

నేడు శ్రీధర్‌రెడ్డి, శాంతమ్మ రోడ్‌షో

కొత్తచెరువు: లోచర్ల గ్రామంలో శనివారం మధ్యాహ్నం పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, హిందూపురం ఎంపీ అభ్యర్థి బోయ శాంతమ్మ భారీ రోడ్ షో నిర్వహిస్తున్నట్లు మండల కన్వీనర్ నారేపల్లి జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణలు పాల్గొనాలని కోరారు.

పుట్టపర్తి అర్బన్: పెడపల్లి ,పెద్దతండా, చిన్న తండాలో . శనివారం ఉదయం 9 గంటలకు ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని ఎంపీపీ ఏవీ రమణారెడ్డి కోరారు.

జగనన్నతోనే సంక్షేమాభివృద్ధి సాధ్యం



సోమందేపల్లిలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



రొద్దం మండలం బొక్సంపల్లిలో ప్రచారం చేస్తున్న నాయకులు



పరిగిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



నల్లగుట్లపల్లిలో ప్రచారం చేస్తున్న దుద్దుకుంట కిషన్ రెడ్డి

సోమందేపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం తుంగోడు, ఈదుళబలాపురంతో పాటు సోమందేపల్లిలోని ఎస్సీ కాలనీ, నక్కలగుట్ట కాలనీలో ప్రచారం చేపట్టారు. ఎంపీ అభ్యర్థి శాంతమ్మ, ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీచరణ్‌లను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణరెడ్డి, మాజీ కన్వీనర్ వెంకటరత్నం, మాజీ సర్పంచ్ రమాకాంత్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ ఆదినారాయణరెడ్డి, జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు నాగభూషణం రెడ్డి, సేవాదళ్ జిల్లా చైర్మన్ వేణు, వైస్ ఎంపీపీ వెంకట నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రొద్దం: సార్వత్రిక ఎన్నికల్లో రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుకు వేసి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీరణ్, ఎంపీ అభ్యర్థి శాంతమ్మను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ నాయకులు ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం మండలంలోని బొక్సంపల్లి, ఎల్‌జీబీ నగర్, కోగిర గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. చంద్రబాబు మాయమాటలు నమొద్దని, సంక్షేమ ప్రధాత జగనన్నను మళ్లీ సీఎం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు బి.నారాయణ రెడ్డి, అక్కులప్ప, సి.నారాయణరెడ్డి, బోయ నరసింహులు, ఎస్.నారాయణరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ చిలకల రవి, వినయ్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బోయ తిమ్మయ్య, రాజారెడ్డి, రామకృష్ణ, రాజ్‌గోపాల్‌రెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాన్ గుర్తుకు ఓటేయండి

ఓడీచెరువు: జగనన్న జనరంజక పాలన కొనసాగాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓటేసి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, బోయ శాంతమ్మను గెలిపించాలని ఎమ్మెల్యే తనయుడు దుద్దుకుంట కిషన్‌రెడ్డి ప్రజలను కోరారు. వెంకటాపురం పంచాయతీలోని నారప్పగారిపల్లి, నల్లగుట్లపల్లి, మల్లెంవాండ్లపల్లి, బోగానిపల్లి, బండకిందపల్లి, వీరోబునపల్లి, పాలినేనివారిపల్లి, దొన్నికోటవారిపల్లిలో ఇంటింటా ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దామోదర్ రెడ్డి, బూత్ లెవెల్ మేనేజర్ గోవర్ధన్ రెడ్డి, అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ లక్ష్మిరెడ్డి, యూత్ కన్వీనర్ హరినాథరెడ్డి, సీనియర్ నాయకులు రంగారెడ్డి, చెన్నారెడ్డి, శ్రీనివాస రెడ్డి, వెంకటేష్, కె.వి.రమణ, వెంకట రమణప్ప, చిన్నకుమార్, రాజారెడ్డి, డీలర్ శివారెడ్డి, నంజిరెడ్డి, హనుమంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిగి: మండలంలో పలు గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఉషశ్రీచరణ్, హిందూపురం పార్లమెంట్ అభ్యర్థి బోయ శాంతమ్మ గెలుపు కోసం ఆ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు శుక్రవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి గడపకూ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించారు. అనంతరం ఆయా కుటుంబాలకు ప్రభుత్వం చేకూర్చిన లబ్ధిని తెలియజేశారు.

ఏడి ‘పింఛన్’

- పింఛన్ కోసం లబ్ధిదారులకు కొనసాగుతున్న కష్టాలు
- చంద్రబాబు నిర్వాకంపై పింఛన్‌దారుల ఆగ్రహం



పెడపల్లి ఏపీజీబీ వద్ద పడిగాపులు కాస్తున్న వృద్ధులు

పెనుకొండ: పింఛన్ డబ్బుల కోసం వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు పడరాని పాట్లు పడుతున్నారు. శుక్రవారం ఉదయమే ఆయా ప్రాంతాల్లో బ్యాంకుల ముందు బారులు తీరారు. ఇన్నాళ్లు వలంటీర్లు తెల్లవారుజామునే తలుపుతట్టి మరీ పింఛన్ చేతికి అందించేవారని, చంద్రబాబు అండ్ కో నిర్వాకం వల్ల తమకు ఈ దుస్థితి వచ్చిందని మండిపడుతున్నారు. నిస్వార్థంగా పనిచేస్తున్న వలంటీర్లపై వారికెందుకు అంతకోపమని ప్రశ్నించారు. పెనుకొండలోని స్థానిక స్టేట్‌బ్యాంక్ వద్దకు పెద్ద ఎత్తున వచ్చిన పింఛన్‌దారులు బ్యాంక్ సిబ్బంది ఇచ్చే విత్‌డ్రాయిల్ ఫారాలు పూరించడానికి, ఈ-కేవైసీ కోసం నానా ఇబ్బందులు పడ్డారు. అయితే పాతబకాయిలకు తమ పింఛన్ జమ చేసుకుంటున్నారని పలువురు పింఛన్‌దారులు వాపోయారు.

పుట్టపర్తి అర్బన్: ప్రతి నెలా 1వ తేదీనే చల్లగా ఫ్యాన్ కింద కూర్చొని పింఛన్ అందుకునే వృద్ధులు, వికలాంగులు మండుటెండలో బ్యాంకుల వద్ద పడిగాపులు కాస్తున్నారు. శుక్రవారం పెడపల్లి , వెంగళమ్మచెరువు ఏపీజీబీ బ్యాంకుల వద్ద ఉదయం 9 గంటలకే పింఛన్ సొమ్ము కోసం చేరుకున్నారు. గంటల తరబడి నిరీక్షించి పింఛన్ సొమ్ము తీసుకున్నారు. వలంటీర్లుంటే తమకు ఈ కష్టాలు ఉండేవి కావని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

2 రోజులుగా పెనుకొండలోనే...



పింఛన్ డబ్బుల కోసం రెండు రోజులుగా పెనుకొండలోనే ఉంటున్నా. అయినా ఇంకా పింఛన్ డబ్బులు మాత్రం చేతికి అందలేదు. ఎర్రటి ఎండలో మాడిపోతున్నాము. ఇంటి వద్దనే ఎంతో సంతోషంగా వలంటీర్ల చేతి నుంచి పింఛన్ తీసుకునేవాళ్లం. చంద్రబాబు రాజకీయాల వల్ల మాకు దుస్థితి పట్టింది.

– సంజీవప్ప, అడదాకులపల్లి, పెనుకొండ మండలం

మా ఉసురు తగులుతుంది



వలంటీర్లు మాకు ఎంతో చక్కగా సంతోషంగా ఇంటి వద్దకే పింఛన్ తెచ్చి ఇచ్చేవాళ్లు. టీడీపీ వాళ్లు ఎన్నికల కమీషన్‌కు ఫిర్యాదు చేసి వృద్ధులు, వికలాంగులను పింఛన్ కోసం బజారు పాలు చేశారు. మా ఉసురు వాళ్లకు కచ్చితంగా కొట్టుకుంటుంది. ఎండతో ప్రాణాలు పోయే పరిస్థితి ఉంది. – అంజినమ్మ, అడదాకులపల్లి, పెనుకొండ మండలం

నానా తిప్పలు పడుతున్నాం



పింఛన్ డబ్బుల కోసం రెండు రోజులుగా నానా తిప్పలు పడుతున్నాము. బ్యాంక్‌లో పింఛన్ తీసుకోవడానికి ఆధార్ కార్డు, విత్‌డ్రాల్ ఫారం సమర్పించాము. వాటి సరి చేసుకున్నాకనే పింఛన్ ఇస్తామంటున్నారు. ఎండలకు అల్లాడిపోతున్నాం.

– వెంకటేష్, దుద్దేబండ, పెనుకొండ మండలం